క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కేపై ఆరోపణలు తగదు

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని అసత్య ఆరోపణలు చేయడం బీజేపీ నేతలకు తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాలలోని క్రిస్టియన్ పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల మనోభావాలను కాపాడుతున్న ఎమ్మెల్యే ఆర్కేపై రాజకీయ దురుద్దేశంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పెద్దేటి యోహాను, గురువిందపల్లి సుగుణరాజు, బులుసుపాటి యల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిశీలన

ఫిరంగిపురం: పేదలకు అందుబాటులో వైద్య సేవలు అందేలా వైద్యులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఓపీ రిజిస్టార్ పరిశీలించి వైద్యురాలు ఫరీనాబేగంతో మాట్లాడారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, డి.సురేష్, బి.శ్రీనివాసరెడ్డి, ఈ. పూర్ణరెడ్డి, సిబ్బంది సుదర్శన్‌రాజు, గాయత్రీదేవి పాల్గొన్నారు.

ఈమని పాఠశాల హెచ్‌ఎంగా ఝాన్సీరాణి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఏఎస్ ఝాన్సీరాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పెటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణికి పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బొంతు కోటయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్

తాడేపల్లిరూరల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు తాడేపల్లి పశువైద్య అధికారి నరేంద్రరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి తాడేపల్లి పట్టణ పరిధిలోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాలు వేయనున్నామని చెప్పారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈసీసీఈపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పూర్వ బాల్య దశ సంరక్షణ విద్య(ఈసీసీఈ) కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సేవలు వివరించారు. పిల్లలపై తల్లిదండ్రుల బాధ్యత గురించి అవగాహన కల్పించారు. ప్రీ స్కూల్ విధానాన్ని తెలిపారు. 3 నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. పలు అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తోట శివపార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు కొణిజేటి రమేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని అయితానగర్‌లోని డగ్లస్ మెమోరియల్ రెసిడెన్షియల్ ఎలిమెంటరీ స్కూల్‌కు రెండు సీలింగ్ ఫ్యాన్‌లను బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సాతులూరి రామ్‌ప్రసాద్, క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నేరెళ్ల కృష్ణ మోహనరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, కుమార్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు చావలి స్వర్ణలత, ఉపాధ్యాయులు సుజాత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ఎమ్మెల్యే ఆర్కే



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష అని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తపేట, భగత్‌సింగ్‌నగర్ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొన్ని అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కొత్తపేట సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు, వలంటీర్లు, గృహసారథులు 1106 నివాసాలలో సర్వే నిర్వహించారని, ఆ సర్వేలో 257 అర్జీలను వలంటీర్లు స్వీకరించినట్లు చెప్పారు. వాటిలో కుల, ఆదాయ, రేషన్ కార్డులు, పెన్షన్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డ్ అప్‌డేట్, మార్పులు వంటి వాటిని పరిష్కరించి ఒక్క రోజులో 248 మందికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి అందజేసినట్లు తెలిపారు. 116 గృహాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, సంక్షేమ పథకాల ద్వారా 98 శాతం మంది లబ్ధిపొందినట్లు వివరించారు. జగనన్న సురక్ష ద్వారా మిగిలిన 2 శాతం ప్రజలకు కూడా ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు చెప్పారు. భగత్ సింగ్ నగర్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఫిరోజ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మంగళగిరి పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, తహసీల్దార్ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



దరఖాస్తు దారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి

గంట వ్యవధిలోనే అర్జీ పరిష్కారం

తాడేపల్లిరూరల్: అర్జీదారులకు గంట వ్యవధిలోనే న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని 1వ సచివాలయం, 14వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, సెక్రటరీ శ్రీనివాసరావు, గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదుల మూడి డేవిడ్ రాజు హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎ.ఇ. కిషోర్, ఆర్‌ఓ మురళి, ఆర్‌ఐలు వంశీకృష్ణ, ప్రశాంతి పాల్గొన్నారు.

పేదల చదువు బాధ్యత ప్రభుత్వానిదే..

ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

మేడికొండూరు: పేద విద్యార్థుల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుందని ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అమ్మ ఒడి నగదు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. బత్తుల మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో తమ పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఎవరికి రాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. మండలంలో అమ్మ ఒడి పథకం కింద 5,289 మంది తల్లుల ఖతాల్లో రూ.7.5 కోట్ల జమ చేసినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకుందని వివరించారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చి నూతన విద్యా ఒరవడికి నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, ఎంపీడీఓ కె.ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజి పాల్గొన్నారు.

వ్యవసాయం అంటే రేపటి తరానికి భవిష్యత్

కేఎల్‌యూ ఎంహెచ్‌ఎస్ డీన్ కిషోర్‌బాబు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వ్యవసాయ విభాగం డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్, డీన్ డాక్టర్ కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: వ్యవసాయం అంటే రేపటి తరానికి భవిష్యత్ అని కేఎల్‌యూ ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు అన్నారు. వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యూఎస్‌ఏ నుంచి డాక్టర్ మహంతి ముఖ్య అతిథిగా విచ్చేసి వ్యవసాయంలో తలెత్తిన వివిధ మార్పులు గురించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, వ్యవసాయ విభాగ డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ మురగన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మంగళగిరిలో అదనపు జిల్లా కోర్టు మరమ్మతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: మంగళగిరిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) బుధవారం పరిశీలించారు. పట్టణ పరిధిలో కోర్టు ఆవరణలో అదనపు జిల్లా కోర్టు మరమ్మతులపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు మూడు కార్యాలయ గదులను నిర్మించడానికి స్థలాన్ని పరిశీలించారు. కోర్టుకు వచ్చే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కక్షి దారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కోర్టు ఆవరణలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, కోర్టు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఒక స్కావెంజర్‌ను, ఒక స్వీపర్‌ను త్వరలోనే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణ పరిధిలోని అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్ర అధికారులు పార్కింగ్ షెడ్డు ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే స్పందించిన ఆయన పార్కింగ్ షెడ్డు నిర్మాణం చేసి అవసరమైనచోట మెరక తోలవలసినదిగా కార్పొరేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డి.ఇ. కృష్ణారెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో వరి విత్తనాలు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు వరి విత్తనాలను బుధవారం మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా బీపీటీ 5204 విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, బస్తా ధర 947.50 రూపాయలు కాగా సబ్సిడీ 125 రూపాయలు లభిస్తుందని తెలిపారు. రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలు ఉంటున్న ఇళ్లను రెగ్యులరైజేషన్ చేయాలి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని అమరారెడ్డి నగర్, యానాదుల కాలనీ, కొత్తూరు పీడబ్ల్యూడీ కట్టలపై నివాసముంటున్న పేదల ఇళ్లను రెగ్యులరైజేషన్ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణ పరిధిలోని 4,5 వార్డు సచివాలయాల వద్ద ఇళ్ల వాసులతో కలసి బుధవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గత 40–50 సంవత్సరాల నుంచి సుమారు వెయ్యి కుటుంబాలకు వారు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, వీరికి గతంలో పంచాయతీ, మున్సిపల్ వారు మౌలిక సదుపాయాలు కల్పించారని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలోని వివిధ గ్రామాల్లో సెంటు స్థలం పట్టాలు ఇవ్వడంతో ప్రస్తుతం నివాసముంటున్న ఇళ్లను తొలగిస్తారని ఆందోళనచెందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సచివాలయం అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కొట్టే కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, యనమాల బర్నబాస్, కట్టామేరీ, దోగిపర్తి యోహాన్, లంకా యలమందాచారి, మోటుపల్లి దావీద్, కంపా వెంకటయ్య పాల్గొన్నారు.

వృద్ధురాలికి అరుదైన చికిత్స

రేడియేషన్ థెరఫీతో ఘనత సాధించిన అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు



డాక్టర్ మణికుమార్

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పరిధిలోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు చర్మ క్యాన్సర్ బారిన పడిన 90 ఏళ్ల మహిళ మొహంలోని కొంత భాగాన్ని విజయవంతంగా పునరుద్ధరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్టిట్యూట్ ఎండీ, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ మణికుమార్ వివరాలు వెల్లడించారు. 90 ఏళ్ల వృద్ధురాలు మొహంపై ఎడమ వైపు అల్సర్ పుండుతో బాధపడుతోందన్నారు. ఆస్పత్రిలో ఒక సర్జన్ ఆమెను పూర్తిగా పరీక్ష చేసి, బాసల్ సెల్ కార్సినోమా ఉన్నట్లు నిర్ధారించినట్లు చెప్పారు. ఇది ఒక రకమైన చర్మ క్యాన్సర్‌ని తెలిపారు. ఇది సూర్యరశ్మి ప్రభావానికి గురయ్యే చర్మ క్యాన్సర్ అని చెప్పారు. మంగళగిరిలోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ)లో శస్త్ర చికిత్స చేయించుకోవాలని బాధితురాలు కోరుకున్నట్లు తెలిపారు. రోగి ఆందోళనను పరిగణనలోకి తీసుకుని ఏఓఐలోని మల్టీ డిసిప్లీనరీ బృందం శస్త్ర చికిత్సకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రాన్ బీమ్ థెరపీ కొనసాగించామని వివరించారు. కణతికి చికిత్స చేయడానికి క్యాన్సర్ ఉన్న ప్రాంతానికి రేడియేషన్ థెరపీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇది చర్మం ఉపరితలంపై అధిక మోతాదును అందించగలదని, లోతైన సాధారణ కణజాలానికి నష్టం కలిగించదని పేర్కొన్నారు. నేరుగా సూర్యరశ్మి బారిన పడకుండా ఉండడం ద్వారా చర్మ క్యాన్సర్‌లను నివారించవచ్చని తెలిపారు. దాదాపు రెండు వారాల పాటు ఈ చికిత్స కొనసాగిందని వివరించారు.

తల్లీపిల్లలకు.. అమృత హస్తాలు

- తెనాలిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం
- ప్రతినెలా 250 నుంచి 300 వరకు ప్రసవాలు
- త్వరలో రూ.40 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్



తెనాలి: డివిజనులోని వందలాది గ్రామాల్నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తూ రాష్ట్రంలోనే అగ్రగామిగా కొనసాగుతున్న స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న తల్లీ పిల్లల వైద్యశాల(మాతా శిశు సంరక్షణ కేంద్రం) ఆధునికతను సంతరించుకుంది. గర్భం దాల్చిన దగ్గర్నుండి ప్రసవం వరకు, అప్పుడే పుట్టిన బిడ్డలకు వచ్చే సమస్యలతో సహా చికిత్సలు చేస్తూ, వారిని క్షేమంగా ఇంటి దగ్గరకు చేర్చే వరకు బాధ్యత తీసుకుంటోంది. హైరిస్క్ ప్రసవాలను చేస్తూ, లేపరో స్కోపిక్ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలతోనూ పురోగమిస్తోంది. స్థానిక చెంచుపేటలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో వంద పడకలతో కూడిన తల్లీ పిల్లల వైద్యశాల 2017లో ఆరంభమైంది. అరకొర వసతులతో మొదలైన వైద్యశాల ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో ఆధునికతను సంతరించుకుంది. గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యనిపుణులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు సరిపడ సంఖ్యలో పనిచేస్తున్నారు. ఆధునిక వైద్య పరికరాలు, యూనిట్లు, అత్యాధునిక లేబొరేటరీ సహా తల్లీపిల్లలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తుండటం విశేషం.

పెరిగిన ఔట్ పేషెంట్లు..

ప్రతిరోజూ 150–200 మంది గర్భిణులు ఔట్‌పేషెంట్లుగా వస్తుంటారు. వీరికి అవసరమైన అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు చేస్తున్నారు. అవన్నీ ఒక ఫైలులో నమోదు చేస్తారు. రోజుకు 800 పైగా ల్యాబ్ పరీక్షలు జరుగుతున్నాయి. డాక్టర్ల సిఫార్సులపై ఆల్ట్రాసౌండ్ స్కానింగ్‌నూ చేస్తున్నారు. సగటున రోజుకు 50–70 వరకు స్కానింగ్ చేస్తూ, అవసరమైన చికిత్సలు చేస్తున్నారు. కాన్పుల విభాగంలో సాధారణ ప్రసవాలతో పాటు హైరిస్క్ ప్రసవాలను కూడా చేస్తున్నారు. గుర్రపువాతం, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. రోజుకు కనీసం 10 డెలివరీలు ఉంటున్నాయి. గతంలో అత్యధికంగా సిజేరియన్ కాన్పులే ఉండేవి. ఇప్పుడు నార్మల్ డెలివరీలపై అవగాహన కలిగిస్తూ, సగానికి సగం తగ్గించగలిగామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.సౌభాగ్యవాణి చెప్పారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్నారు. ఇక్కడ ప్రసవమైన తల్లులకు మాతా శిశు సురక్ష యోజన, ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ.4–5 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో వారిని క్షేమంగా ఇంటికి చేరుస్తున్నారు.

కాన్పుల కోసం పడకలు..

లేబర్ రూమ్‌లో హైరిస్క్ కాన్పుల కోసం ప్రత్యేకంగా 8 పడకలతో విభాగం పనిచేస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయటమే కాకుండా ఇటీవలే లాపరోస్కోపిక్ విధానంలో ఈ ఆపరేషన్లను ప్రారంభించారు. ఇటీవలే ఈ తరహా ఆపరేషన్లు రెండింటిని చేశారు. ప్రత్యేక కౌన్సెలింగ్ సెంటర్‌లో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిడ్డకు బిడ్డకు ఎడం తగినంత ఉండేందుకు బాలింతలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. హెచ్‌ఐవీ, ఎస్‌టీడీ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య జాగ్రత్తలు పాటించేలా చూస్తున్నారు.

కేర్ యూనిట్ సేవలు..

నవజాత శివువులకోసం వైద్యశాలలో ఇరవై క్రైబ్స్‌తో స్పెషల్ నియోనేటల్ కేర్ యూనిట్ పనిచేస్తోంది. కామెర్లు, అంటువ్యాధులు, పుట్టిన వెంటనే ఏడవకపోవటం, బరువు తక్కువగా పుట్టటం వంటి కేసుల్లో, వెంటిలేటర్ సహా అన్ని అత్యవసర పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నారు. పుట్టిన పిల్లలకు గతంలో ప్రతి బుధవారం, శనివారం ఇమ్యూనైజేషన్ డోస్ ఇచ్చేవారు. అందుకోసం పిల్లలతో తల్లులు ఇక్కడకు రావాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరం లేకుండా పుట్టిన బిడ్డకు టీబీ, పోలియో, హెపటైటిస్–బి వంటివి రాకుండా జీరో డోస్ ఇమ్యూనైజేషన్ ఇస్తున్నారు.

మృతుడి కుటుంబానికి నష్టపరిహారం



ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఇందిరానగర్‌కు చెందిన రాంపర్తి రామకృష్ణ గుంటూరు యూనియన్ బ్యాంక్‌లో విద్యుత్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, బ్యాంకు అధికారులతో మాట్లాడి మృతి చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులకు బుధవారం నష్టపరిహారం అందజేయించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే చొరవతో రూ.12,82,000 నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. ఎమ్మెల్యే ఆర్కే చూపించిన చొరవకు హైకోర్టు అడ్వకేట్, పద్మశాలీ సంఘ సీనియర్ నాయకులు వైకే, మరియు ఇతర బీపీ నాయకులు ఎమ్మెల్యే ఆర్కేకు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడులోని పద్మావతి, అలివేలు మంగా సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను ఉంచి వేద పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ గణపతి పూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, శాంతి కల్యాణం నిర్వహించారు. పూజకార్యక్రమాలలో ఐలా శ్రీనివాసరెడ్డి, రవితేజారెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పదో తరగతి తప్పిన విద్యార్థులకు మరో అవకాశం



కొల్లిపర: 2022–2023లోపదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ కోరారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. 10వ తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులతో ఆమె మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించి విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పుకోవాలన్నారు. ఏడుగురు విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించుకుని వారికి జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సాల్మన్ రాజు, ఝాన్సీలత, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భూపతినాయుడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం.రమేష్ , సీఆర్‌పీలు రమేష్ బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

యోగ ధ్యానంతో సంతులిత జీవితం

యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానందగిరి



తెనాలి: పురాతన ఆధ్యాత్మిక శాస్త్రమైన క్రియా యోగాన్ని శ్రద్ధతో సాధన చేస్తే భగవంతునితో అపరోక్ష, వ్యక్తిగత అనుభవం కలుగుతుందని 'యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా' (వైఎస్ఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానందగిరి చెప్పారు. యోగదా సత్సంగ ధ్యానమండలి, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక ఎస్‌వీఆర్ కన్వెన్షన్ సెంటరులో 'ఆనందమైన, సాఫల్యవంతమైన జీవితం కోసం క్రియా యోగధ్యానం' అంశంపై ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. వైఎస్ఎస్ నొయిడా ఆశ్రమం నుంచి వచ్చిన స్వామి స్మరణానందగిరి ఎల్లప్పుడూ ఎడతెగని సంతోషంగా ఉండాలనేది ప్రతిఒక్కరి జీవిత ధ్యేయంగా చెప్పారు. దుఃఖసాగరమైన సంసారంలో కుటుంబ, వ్యక్తిగత, సామాజికపరమైన సమస్యలతో అందరికీ అది సాధ్యం కాదన్నారు. 'నేను ఆనందాన్నుంచి వచ్చాను...ఆనందం కోసం జీవిస్తాను...ఆనందంలో ఒకనాటి నేను లీనమైపోతాను' అనేది ఉపనిషత్తులో ఉందన్నారు. ఎంతోమంది సాధువులు, ప్రాచీన ఋషిశ్రేష్ఠులు చెప్పిన సూత్రాలు అనుసరిస్తే అందులోని సత్యం బోధపడుతుందని చెప్పారు. యోగధ్యానంతో సమస్యలనేవి తగ్గకపోయినా వాటివల్ల వచ్చే భయం తొలగి ధైర్యం సమకూరుతుందని వివరించారు. ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. శరీరంతోపాటు మనస్సును, ఆత్మను కూడా సరిగా చూసుకోవాలని, ఇందుకు సానుకూల దృక్పథం తోడ్పడుతుందని స్వామి స్మరణానందగిరి సూచించారు. స్వచ్ఛమైన ప్రేమ, నిత్య నవీన ఆనందం , సృజనాత్మకత వంటివెన్నో వస్తాయని చెప్పారు. ఆత్మను సరిగా చూసుకుంటే సంతులిత జీవితం సాధ్యపడుతుందన్నారు. ధ్యానం అనేది అనుభవమని, భగవంతుడిని పరోక్షంగా అనుభవిస్తామని తెలిపారు. ఇందుకు శ్రీశ్రీ పరమహంస యోగానంద సంపూర్ణ సాహిత్యం, అందులోని క్రియా యోగధ్యానం ఉపకరిస్తాయని వివరించారు. జీవితంలోకి సర్వతోముఖ సాఫల్యాన్ని సంపూర్ణంగా ఆకర్షించటానికి సహాయ పడుతుందని అన్నారు. తొలుత స్వామి ప్రజ్ఞానందగిరి, పరమహంస యోగానంద స్థాపించి, వందేళ్లకు పైగా నడుస్తున్న యోగదా సత్సంగ మండలి విశేషాలను తెలియజేశారు. తెనాలి శాఖ తరపున నన్నపనేని సుధాకర్, నారాయణరావు, నన్నపనేని భాగ్యలక్ష్మి స్వాగతం పలికారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

కొటమరాజు వెంకటేష్ శర్మ, అడ్వకేట్
అశోక్ నగర్, 4వలైను, విజయవాడ. సెల్ : 9030945678